

జమ్మికుంట ఎఫ్‌సీఐ వద్ద అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్



పార్లమెంట్ ఎన్నికలపై బీఆర్ఎస్ నజర్

- సోషల్ మీడియా వారియర్లతో ప్రత్యేక సమావేశం
- గెలుపే లక్ష్యంగా వ్యూహరచన
- దిశానిర్దేశానికి కేటీఆర్ రాక
- నేడు కరీంనగర్‌లో సమావేశం

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

అసెంబ్లీ ఎన్నికలు చేదు ఫలితాన్ని చవిచూపి అధికారానికి దూరం చేసినా పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి ప్రజల్లో తమ పట్ల ఆదరణ చెదరలేదని నిరూపించు కోవడానికి బీఆర్ఎస్ పార్టీ సన్నద్ధమవుతున్నది. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో ఆ పార్టీ నాయకుడు, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్ఎస్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కేవలం మూడు స్థానాలు మాత్రమే గెలుచుకున్నా నాలుగు స్థానాల్లో విజయం సాధించిన కాంగ్రెస్ కంటే ఐదు వేల ఓట్ల ఆధిక్యతతోనే ఉన్నామన్న ధీమాతో ఆ పార్టీ సమ రోత్సాహాన్ని ప్రదర్శి స్తున్నది. ఇప్పటికే అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ స్థాయిలో సోషల్ మీడియా వారియర్స్ సమావేశాన్ని రేకుర్తి రాజ శ్రీ గార్డెన్‌లో బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీ రామారావు ఈ సమావేశానికి హాజరై పార్టీ అభ్యర్థి విజయానికి అమలు పరచాల్సిన ప్రచార వ్యూహాన్ని వివరించను న్నారు. ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకంగా మారడంతో సోషల్ మీడియా వారియర్స్ సమావేశాన్ని ప్రత్యేక దృష్టితో చూస్తున్నారు. టీఆర్ ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సాధించిన ప్రగతిని, సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలితాలను ప్రజల దృష్టికి తీసుకవెళ్లే విధంగా ప్రచారం చేయడం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్న పద్ధతులు వారి పాలనలో ప్రజల స్థితిగతులను పోల్చిచూపుతూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం ద్వారా ప్రజలను ఆకట్టుకోవడం అంతిమంగా పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి కైవసం చేసుకునే లక్ష్యాన్ని వారియర్స్ ముందు ఉంచనున్నారని చెబుతున్నారు. ఇప్పటికే ఈ నెల 4న హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమా వేశాన్ని నిర్వహించారు. అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమీక్షా సమావేశాలను నిర్వహించి అసెంబ్లీ ఫలితాలను విశ్లేషించుకోవడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించి విజయం సాధించేందుకు తీసుకోవలసిన చర్యల గురించి క్షేత్రస్థాయి నేతల సూచనలను తీసుకున్నారు. వీటన్నిటికీ అనుగుణంగా వ్యూహం రూపొందించు కొని ముందుకు సాగాలని పార్టీ నాయకత్వం నిర్ణయించుకున్నట్లు సమాచారం.

● ఓటింగ్ శాతంపై ఆశలు

కరీంనగర్ పార్లమెంట్ స్థానం పరిధిలో కరీంనగర్, హుజురాబాద్, సిరిసిల్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపొందింది. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కేటీ రామారావు, పాడి కౌశిక్‌రెడ్డి ఈ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. మానకొండూర్, చొప్పదండి, వేములవాడ, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్య ర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించినా ఓట్లు మాత్రం బీఆర్ఎస్‌కే ఎక్కువగా పోలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీకి ఈ యేడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5,17,596 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 5,12,437 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 2,50,279 ఓట్లు వచ్చాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ఆలోచనా సరళిలో కేంద్ర ప్రభుత్వం ప్రధానిగా ఎవరుండాలి.. అన్న అంశాలు ప్రాధాన్యతగా మారుతాయి. గత ఎన్నికల్లో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు కేవలం లక్షా రెండువేల ఓట్లు మాత్రమే రాగా నాలుగు నెలల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు 4,98,276 ఓట్లు వచ్చి 90వేల మెజార్టీతో ఎంపీగా విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు 4,08,768 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు 1,79,258 ఓట్లు పోలయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం కరీంనగర్ పార్లమెంట్ స్థానం పరిధిలో నాలుగు అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని బీఆర్ఎస్‌తో సమానమైన ఓట్లు సాధించింది. ఆరు గ్యారెంటీల హామీలలో రెండింటిని అమలు చేసి 100 రోజుల్లో మిగతా హామీలను అమలు చేస్తామని ఆ పార్టీ ప్రభుత్వం హామీ ఇస్తున్నది. కాంగ్రెస్ విజయ ప్రభావంతో పాటుగా ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో అయోధ్య రామాలయంలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అంశం ఆ పార్టీకి కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. మూడోసారి నరేంద్రమోదీ అనే నినాదంతో బీజేపీ ముందుకు సాగుతున్నది. మోదీ, అయోధ్య రామాలయ అంశాల ప్రభావానికి అడ్డుకట్టవేస్తూ అనుసరించాల్సిన వ్యూహరచన, అమలు ప్రధాన లక్ష్యంగా సోషల్ మీడియా వారియర్ల సమావేశంలో చర్చిస్తారని అందుకే ఈ సమావేశానికి పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీ రామారావు వస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సీఎంఆర్ గడువులోపు అందించాలి

● జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్

జమ్మికుంట, జనవరి 23: సీఎంఆర్ బియ్యం పెట్టడంలో ఎందుకు ఆలస్యం అవుతుందని, గడువులోపు అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ)ని సందర్శించారు. గోదాములను పరిశీలించారు. జమ్మికుంట పరిధిలోని మిల్లుల్లో ఇంకా ఎన్ని బియ్యం పెండింగ్ ఉన్నాయని సివిల్ సప్లై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాటా డుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు వందల ఏసీకెల బియ్యం లేవీ కింద మిల్లర్లు ఎఫ్‌సిఐకి పెట్టాల్సి ఉందన్నారు. వాటిలో వంద టన్నులు కరీంనగర్ గోదాములకు వెళ్లాల్సి ఉండగా, మానకొండూర్, కేశవపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట నుంచి మరో ఐదు వందల ఏసికెలు స్థానిక ఎఫ్‌సిఐకి ట్యాగ్ చేసినట్లు తెలిపారు. మరో ఏడు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని, గణతంత్ర దినోత్సవం, ఆదివారం రెండు రోజులు సెలవు దినాలు వస్తున్నాయని, ఐదు రోజుల్లో ఐదు వందల ఏసికెలు ఎఫ్‌సిఐలో దిగుమతి చేయాలన్నారు. రోజుకు వంద ఏసికెల చొప్పున ఐదు రోజులు దిగుమతి చేస్తనే లక్ష్యం పూర్తి అవుతుందన్నారు. ఇందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి రజనీకాంత్, తహసీల్దార్ రజని, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బి నర్సింగరావు అధికారులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జనవరి 23: జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం రెవెన్యూ గార్డెన్‌లో విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి తరగతిలో విద్యార్థులు డ్రాప్‌ఔట్ కాకుండా ఉత్తమ ఫలితాలను సాధించేలా కృషిచేయాలని అన్నారు. ప్రతి విద్యార్థి 10వ తరగతి తర్వాత ఇంటర్, డిగ్రీ పూర్తి చేసేలా దృష్టిపెట్టాలని, టీచింగ్, లర్నింగ్, మెటీరియల్ మేళా నిర్వహించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, భాషపై దృష్టిపెట్టాలని, ప్రతి విద్యార్థి ప్రతిరోజు రెండు పేజీలు అన్ని సబ్జెక్టులు రాసే విధంగా చూడాలని అన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి కనీసం పాసయ్యే విధంగా చూడాలన్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి 3 లేదా 4 సార్లు పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలను ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు వారికి వివరించాలని చెప్పారు. విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ మెరుగైన ఫలితాలను సాధించేలా చూడాలన్నారు. జిల్లాలో గతంలో పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులను 152 మందిని గుర్తించి 121 మంది విద్యార్థులచే పరీక్ష ఫీజు చెల్లించడం జరిగిందని, ఆ విద్యార్థులు పాస్ అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, ఎంఈవోలు, సెక్టోరల్ అధికారులు, డీసీఈబీ సెక్రటరీలు, జిల్లా సైన్స్ అధికారి, ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

గ్రంథాలయంలో దివ్యాంగులకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి

కరీంనగర్ కల్చరల్ : జిల్లా గ్రంథాలయంలో దివ్యాంగుల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించి రీడింగ్ గదులను పరిశీలించారు. పాఠకులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనుకూలమైన వాతావరణంలో పాఠకులకు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దివ్యాంగులకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం ద్వారా చదువుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. అంధులు చదువుకునేందుకు బ్రెయిలీ లిపిలో ఉన్న పుస్తకాలు, ఆడియో ప్లేయర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● డే కేర్ సెంటర్‌లోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ టౌన్: నగరంలోని జడ్పీ క్వార్టర్స్‌లోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్ సౌకర్యాలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం డే కేర్ సెంటర్‌ను జిల్లా సంక్షేమాధికారి సరస్వతితో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా డే కేర్ సెంటర్‌లోని సమస్యలను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డే కేర్ సెంటర్ ప్రధాన కార్యదర్శి పి.కేశవరెడ్డి, కోశాధికారి సత్యనారా యణ, సిబ్బంది పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో విచారణ వేగవంతం

- తోట రాములు, చీటి రామారావులు 24 గంటల పోలీసు కస్టడీకి
- అక్రమదందాలతో ఎవరెవరికి సంబంధాలు? ఆరాతీయనున్న పోలీసులు
- 120కి చేరిన బాధితుల ఫిర్యాదులు

కరీంనగర్ క్రైం, జనవరి 23 : కరీంనగర్‌లో భూకబ్జాలకు పాల్పడిన కేసులో పోలీసుల విచారణ వేగవంతమైంది. ఒక వైపు నమోదైన కేసులో విచారణ జరుపుతుండగానే ఇంకో వైపున బాధితులు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదులపై విచారణ జరిపి త్వరగా నివేదికలు సమర్పించే విధంగా ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ అనే కొత్త స్పెషల్ పోలీస్‌టీంను ఏర్పాటు చేసిన సీపీ కమిషనరేట్‌లోని వివిధ ఏసీపీలకు విచారణ బాధ్యతలు అప్పగించారు. ఈ నివేదికలు రాగానే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు అయ్యే అవకాశముంది. ఈ నెల 18వ తేదీ నుంచి ఇప్పటి వరకు దాదాపు 125 బాధితులు నేరుగా సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బాధితులు ఫిర్యాదులతో రాగానే స్వయంగా పోలీస్‌కమిషనర్ వారితో మాట్లాడుతూ ఏ విధమైన మోసం జరిగింది? ఏ విధంగా కబ్జాలకు పాల్పడ్డారు? ఈ కబ్జాలు, మోసాల వెనుక ఎవరైనా ఉన్నారా? అనే సమాచారాన్ని బాధితుల వద్ద నుంచి సేకరిస్తూ భూ ఆక్రమణలు, మోసాలు జరిగినట్లు నిర్ధారించుకున్న తరువాతనే ఆ ఫిర్యాదులపై విచారణకు ఆదేశిస్తున్నారు. ఇప్పటికే ఒక కార్పొరేటర్ భూకబ్జా కేసులో వారం రోజుల నుంచి జైలులో ఉండగా మరో ఇద్దరు కార్పొరేటర్లపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఇందులో ఒక కార్పొరేటర్‌పై గతంలో చాలా ఫిర్యాదులు అందినప్పటికీ అప్పటి అధికారులు కఠిన చర్యలు తీసుకోకుండా కొందరు అడ్డుకున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. అయితే కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి భూకబ్జాలు, అక్రమదందాలపై ఉక్కుపాదం మోపుతుండటంతో సదరు కార్పొరేటర్ చేసిన అక్రమదందాలపై సీపీ కఠినంగా వ్యవహరించి తమకు న్యాయం చేస్తారని బాధితులు ఆశిస్తున్నారు.

● భూకబ్జా, దౌర్జన్యం, బెదిరింపులకు పాల్పడినట్లు గత డిసెంబరు 24న కరీంనగర్ ఒకటో ఠాణాలో నమోదైన కేసులో జనవరి 17న అరెస్టు అయి కరీంనగర్ జైలులో ఉన్న కరీంనగర్ కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావులను మంగళవారం ఒకటో ఠాణా పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు బెయిల్ కోసం ప్రయత్నించినప్పటికీ లభించలేదని తెలిసింది. కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు రెండు రోజుల కిందట కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడిని పోలీసుకస్టడీకి తీసుకునేందుకు పిటిషన్ దాఖలు చేయగా ఇద్దరిని 24 గంటలు పోలీసు కస్టడీకి ఇచ్చేందుకు అనుమతిస్తూ కరీంనగర్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం 4:30 గంటలకు ఇద్దరిని పోలీసులు కస్టడీకి తీసుకుని ఠాణాకు తరలించారు. బుధవారం సాయంత్రం 4:30 గంటల వరకు పోలీసులు ఇద్దరిని విచారించనున్నారు. కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావులను ఈ నెల 17న పోలీసులు అరెస్టు చేసిన సమయంలో వారి వద్ద భూములు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు భారీగా లభించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆ డాక్యుమెంట్లను ముందుపెట్టి ఎక్కడెక్కడ కొనుగోలు చేశారా?లేక మరేవిధంగా ఆ ఆస్తులను రాబట్టారనేది విచారించనున్నారు. అలాగే ఈ కేసులో బాధితుడు కొత్త రాజిరెడ్డి ఫిర్యాదు సమయంలో ఇచ్చిన వీడియో, సెల్‌ఫోన్ ఆడియో ఆధారాలతో కూడా ప్రశ్నించనున్నట్లు తెలిసింది. ఈ అక్రమ భూదందాలతో ఇంకెవరెవరికి సంబంధముందని, ఈ దందాకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్‌శాఖ ఉద్యోగులు ఎవరెవరు సహకరించారు? తదితర సమాచారాన్ని నిందితుల నుంచి పోలీసు కస్టడీలో విచారణలో రాబట్టనున్నారు. ఇద్దరు పోలీసు కస్టడీకి తీసుకున్నారనే సమాచరంతో ఆ ఇద్దరికి సన్నిహితంగా మెదిలిన పలువురు ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ తమ పేర్లు బయటకు వస్తాయో. మాపై కూడా చర్యలు తీసుకుంటారా అనే ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. మొత్తానికి ఈ భూ అక్రమదందా కేసు ఎవరెవరి మెడకు చుట్టుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

జమ్మికుంటలో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్

భగత్‌నగర్, జనవరి 23: గోరక్‌పూర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి జమ్మికుంటలో ఆగనున్నదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గోరక్‌పూర్ నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే (12591/ 12592) ఎక్స్‌ప్రెస్ రైలు ఇకపై జమ్మికుంటలో ఆగుతుందని రైల్వే శాఖ జాయింట్ డైరెక్టర్ వివేక్ కుమార్ సిన్హా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వ్యాపార కేంద్రమైన జమ్మికుంటలో పలు రైళ్లకు హాల్ట్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించామన్నారు. నవజీవన్, రాయపూర్, యశ్వంత్‌పూర్, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జమ్మికుంటలో ఆపే విధంగా చూడాలని కోరినట్లు తెలిపారు. దీనితో పాటు సికింద్రాబాద్ గుంటూరు వెళ్లే రైలు నెక్కొండలో ఆగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలి

సుభాష్‌నగర్, జనవరి 23: 2025 నాటికి భారతదేశం టీబీ రహిత దేశంగా కావడానికి కృషి చేయాలని మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వేల్ఫేర్ అధికారి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం నగరంలోని వెంకటేశ్వర దేవస్థానం సమీపంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీపీవో రవీందర్, యూనిసెఫ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కిషన్‌స్వామి బ్యాంకు, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్‌రావు

కుక్కల బెడద నుంచి కాపాడండి..

● మున్సిపల్ కార్యాలయంలో కోడితో నిరసన



కొత్తపల్లి కమిషనర్ ఛాంబర్‌కు వేలాడదీసిన కోడి

కరీంనగర్ రూరల్, జనవరి 23: కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని కోరుతూ కొత్తపల్లిలో ఓ వ్యక్తి మంగళవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. కుక్కల దాడిలో చనిపోయిన కోడిని కొత్తపల్లికి చెందిన అజీజోద్దీన్ మున్సిపల్ కార్యాలయంలో డోర్‌కు వేలాడ దీసి నిరసన తెలిపాడు. కొంత కాలంగా కొత్తపల్లి పట్టణంలో కుక్కలు బెడద ఎక్కువైందని, కుక్కల దాడులతో కొత్తపల్లి పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారని చెపుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. మూడు సంవత్సరాలుగా కుక్కల దాడులతో పలువురు గాయాల పాలయ్యారన్నారు. మేకలపై దాడులు చేసి చంపివేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. తన ఇంట్లోకి కుక్క చొరబడి కోడిని చంపేసిందని చేసేది లేక తాను చనిపోయిన కోడితో నిరసన తెలిపినట్లు అజీజోద్దీన్ తెలిపారు. కమిషనర్ ఛాంబర్ డోర్‌కు వేలాడదీసిన కోడిని పోలీసులు వచ్చి సిబ్బందితో తొలగింపజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జాతీయ సదస్సులో పాల్గొన్న శాతవాహన వైస్‌ఛాన్స్‌లర్ సంకశాల మల్లేశ్

కరీంనగర్ రూరల్, జనవరి 23: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవాలని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ సంకశాల మల్లేశ్ అన్నారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గురుకుల డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల నగునూరు, తెలంగాణ ఉన్నత విద్యామండలి హైదరాబాద్ సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణ, పర్యవేక్షణ పద్ధతులపై రసాయనశాస్త్రం, సూక్ష్మజీవశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయ్యర్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి నిరూప, ఆచార్యులు డి కాశీనాథ్, డాక్టర్‌స్వప్న, డాక్టర్ జి మదన్‌మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ జి సమత, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్ సుష్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె గీతా రాణి, జిస్వప్న, కె స్వాతి, మనీష, అధ్యాపకులు పాల్గొన్నారు.











రూ.6,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 23: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,750 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 84మంది రైతులు 676 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 17 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,750, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.



మానకొండూర్ సామిల్‌లో అగ్ని ప్రమాదం

మానకొండూర్, జనవరి 23: మానకొండూర్‌లోని ఓం గణేశ్ సామిల్‌లో మంగళవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. సామిల్‌లో యజమాని నందగిరి శ్రీనివాస్ రాత్రి 11 గంటల వరకు పని పూర్తి చేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారు జామున ఓ వ్యక్తి సమాచారం ఇవ్వడంతో శ్రీనివాస్ వచ్చి చూసే సరికి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ అధికారికి సమచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. మిల్‌లోని కలపకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని, దీంతో సూమారు రూ. 3లక్షల విలువ గల కలప కాలిపోయిందని శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయంపై పోలీసులు, అగ్నిమాపక అధికారులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 23: పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు పేర్కొన్నారు. నగరంలోని గణాంకభవన్‌లో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సంఘం రూపొందించిన 2024 నూతన సంవత్సర డైరీని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు ఆవిష్కరించగా, క్యాలెండర్‌ను పెన్షనర్స్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు ఆవిష్కరించారు. మంగళవారం జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎం.బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించి పలు సమస్యలపై చర్చించి తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఎంప్లాయీస్ హెల్త్‌కార్డులను అన్ని ఆసుపత్రుల్లో ఆమోదించి పెన్షనర్ల ఆరోగ్య సమస్యలు పరిష్కరించాలని, పేరివిజన్ కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ఇవ్వాలని, స్పెషల్ టీచర్స్‌గా పనిచేసిన కాలాన్ని సర్వీస్‌లో లెక్కించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ తీర్మానించారు.

ఈ సమావేశంలో వి.చక్రపాణి, ఇ.నర్సింహారెడ్డి, జగన్‌మోహన్, పద్మారావ్, బి.సత్యనారాయణ, పి.లచ్చయ్య, ఇ.నర్సింహ రెడ్డి, వీరస్వామి, పురుషోత్తంరావు, కె.మహేందర్ రాజు, కె.రాజమల్లు, బి.డేనియర్, కె.పురుషోత్తంరావు, సత్యనారాయణ, దేవదారి తదితరులు పాల్గొన్నారు.







నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకే ఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరి కొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్లు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే

'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి

హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్లు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలులుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

43 మంది కానిస్టేబుళ్ల బదిలీ

కరీంనగర్ క్రైం, జనవరి23: కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో 43మంది కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. కమిషనరేట్ పరిధి లోని వివిధ పోలీసు ఠాణాలు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న 43 మంది సివిల్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ మంగళవారం పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే వీరందరికి కౌన్సెలింగ్ నిర్వహించిన సీపీ బదిలీలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మూడు చిట్‌ఫండ్స్‌పై కేసులు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 23: చిట్ పూర్తి అయినప్పటికీ సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్న కరీంనగర్‌లోని మూడు చిట్‌ఫండ్స్‌పై కేసులు నమోదు చేశామని రెండో ఠాణా సీఐ వెంకటేష్ తెలిపారు. కరీంనగర్‌లో శుభనందిని చిట్‌ఫండ్స్‌లో 2017 నుంచి 50నెలల చిట్ వేసి, 42 నెలల తరువాత చిట్‌ను ఎత్తుకోగా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదని బాధితుడు చిట్టంపల్లి సత్యం ఫిర్యాదుతో డిప్యూటీ జనరల్ మేనేజర్ తిరుపతిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. భవిత చిట్‌ఫండ్స్‌లో 5లక్షల చిట్ వేసి పూర్తి అయినప్పటికీ ఇంకా రూ.2.5 లక్షలు ఇవ్వలేదని బాధితుడు ఎగ్గెడి శ్రీనివాస్ ఫిర్యాదుతో చిట్‌ఫండ్ యజమాని తాటిపల్లి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. అక్షర చిట్‌ఫండ్స్‌లో 10 లక్షల చిట్ వేయగా ఇంకా రూ.7.4 లక్షలు ఇవ్వలేదని బాధితురాలు చాడ లక్ష్మి ఫిర్యాదుతో చిట్‌ఫండ్స్ యజమాని, చిట్ వేయించిన ఐల రవీందర్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌గా పేరు మారిస్తే బీఆర్‌ఎస్ రాద్ధాంతం



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌గా పేరు మార్చిన బోర్డు

కరీంనగర్ అర్బన్, జనవరి 23: చరిత్రను వక్రీకరించి కేసీఆర్ పేరు వచ్చే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌అండ్‌బీ అతిథిగృహం పేరు మార్చారని, దానిని అధికారులు సరిచేసి పేరు మారుస్తే బీఆర్‌ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేయర్ వై సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు రాచరికపు పోకడలను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతోందని, త్వరలో బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి బాగోతం బట్టబయలవుతుందని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి అంజన్ కుమార్, నాయకులు అశోక్ రావు, అబ్దుల్ రెహమాన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎండి చాంద్, అమేర్, పెద్దిగారి తిరుపతి, చంద్రయ్యగౌడ్, అస్థపురం రమేష్, కీర్తి కుమార్, మహమ్మద్ భారీ, బషీర్, ఎజ్రా, ఇమ్రాన్, నదీమ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్‌హౌజ్‌కు కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌజ్‌గా బోర్డుపెట్టాలి

-బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, జనవరి 23: నగరంలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గెస్ట్‌హౌజ్‌కు కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌజ్‌గా నామకరణం చేసి బోర్డు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ నాయకులు ఆ బోర్డును తొలగించారని, వెంటనే అదే పేరుతో బోర్డును ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో హరిశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు చేయడం లేదన్నారు. నగరంలోని మార్కెట్ సమీపంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను గంగుల కమలాకర్ తిరుమల తరహాలో అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించారని అన్నారు. గతంలో మాదిరిగా స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని ప్రకటిస్తే వాటిని కూడా రాజకీయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, కుల్దీప్ వర్మ, సాయికృష్ణ, షౌకత్ అలి, సత్తినేని శ్రీనివాస్, ఆరె రవి, చేతి చంద్రశేఖర్, వంగ హరీష్, నాగుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'గాండ్ల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి'

గణేశ్‌నగర్, జనవరి 23: గాండ్ల కుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని కుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి జక్కు పుల్లయ్య, కోశాధికారి గుట్టేటి రవిందర్ కోరారు. మార్కెట్‌లోకి పెద్ద నూనె మిల్లులు వచ్చి తమ కుల వృత్తిని దెబ్బతీశాయన్నారు. దీంతో చాలా మంది ఇతర రాష్ట్రాలకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

25న శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర బహిరంగ వేలం

హుజూరాబాద్, జనవరి 23: ఫిబ్రవరి నెలలో హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర టెండర్ కం బహిరంగ వేలం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె సుధాకర్ మంగళవారం తెలిపారు. కొబ్బరికాయలు, బెల్లం, ప్రసాదాలు, తలనీలాల కొరకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే వారు రూ. 30వేల డీడీ కట్టి వేలం పాటలో పాల్గొన్నాలన్నారు.

విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

చొప్పదండి, జనవరి 23: విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలపైనే కాకుండా వ్యవసాయంపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ రైతు మావురం మల్లికార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ అలివేలి, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

తిమ్మాపూర్, జనవరి23: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్‌ఎండి కాలనీలో గల గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మహేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠకుల సంఖ్య తక్కువగా ఉందని జనాలు ఉండే ప్రదేశానికి గ్రంథాలయాన్ని తరలించే విధంగా చూడాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలోకి వీణవంక సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు



రఘుపాల్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్/వీణవంక, జనవరి 23: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళ వారం నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీణ వంక మండలం వల్భాపూర్ గ్రామసర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కాసం కవిత-శ్రీని వాస్, మాజీ సర్పంచ్ అయిలయ్యలతో పాటు మరి కొంత మంది పార్టీలో చేరగా, వారికి ప్రణవ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట రెండు వందల మంది కార్యకర్తలు ఉన్నారు.

పర్సన్ ఇన్‌ఛార్జీలుగా సర్పంచులకే అవకాశం ఇవ్వాలి

సైదాపూర్, జనవరి 23: ప్రస్తుతం సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున ఎన్నికలు జరిగే వరకు సర్పంచులకే పర్సన్ ఇన్‌ఛార్జీలుగా అవకాశం కల్పించాలని సైదాపూర్ సర్పంచులు సూపరింటెండెంట్, ఎంపీవో సురేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ సర్పంచులుగా ఎన్నికైన తరువాత ఎనిమిది నెలల వరకు చెక్ పవర్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండ గణేష్, సర్పంచులు బొడిగ పద్మజ-కొమురయ్య, కాయిత రాములు, కొత్త రాజిరెడ్డి, ఎనుగుల అయిలయ్య, బత్తుల కొమురయ్య, ఆవునూరి పాపయ్య, సర్పంచుల భర్తలు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



కరీంనగర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు, కాంగ్రెస్ నాయకులు, జమ్మికుంటలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ టౌన్, జనవరి 23: సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం నగరంలోని నేతాజీ విగ్రహానికి మేయర్ సునీల్‌రావు, పలువురు కార్పొరేటర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేటి యువతరం ఆ మహనీయుడి ఆశ యాలు, త్యాగాలను నెమరువేసుకోవాలని సూచిం చారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు అర్ష కిరణ్మయి మల్లేశం, గంట కల్యాణిశ్రీనివాస్, కంసాల శ్రీనివాస్, గుగ్గిళ్ళ జయశ్రీశ్రీనివాస్, ఈఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ అర్బన్:** డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. నగరంలోని సుభాష్ నగర్ రహదారిలో ఉన్న నేతాజీ విగ్రహానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడుపు మోహన్, రహమత్ హుస్సేన్, పులి ఆంజనేయులుగౌడ్, కొరివి అరుణ్‌కుమార్, అబ్దుల్ రహమాన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్రపోచయ్య, ముల్కల ప్రవీణ్, వెన్నం రజిత, సిరిపురం నాగప్రసాద్, విక్టర్, ఎండి చాంద్, అబ్దుల్ భారి, ఆరిఫ్, వంగల విద్యాసాగర్, నెల్లి నరేష్, లింగమూర్తి, ఇమ్రాన్, రోడ్ల సతీష్, దీకొండ శేఖర్ పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** నేతాజి ఆలోచనా విధానంతో నేటి యువత ముందుకు సాగాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి అన్నారు. నగరంలో నేతాజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో బండారి శేఖర్, శంకర్, బెక్కంటి రమేష్, ప్రశాంత్‌కుమార్, అస్తపురం విక్రమ్, అతికం రాజశేఖర్ పాల్గొన్నారు.

●భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో నేతాజీకి నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, కటకం లోకేష్, నాగసముద్ర ప్రవీణ్, ఉప్పరపల్లి శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, వాసు, సందీప్ పాల్గొన్నారు.

● తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర చైర్మన్, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ నేతాజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

●నేతాజీకి యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా అధ్యక్షుడు నందగణేష్, గణేష్ కుమార్, సాయికిరణ్, రమేష్‌నివాళులు అర్పించారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ లక్ష్మి, రత్నం, రాజన్న, రమేష్, గంగిశెట్టి జగదీశ్వర్ పాల్గొన్నారు.

●**జమ్మికుంట:** పట్టణంలో నేతాజీ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నివాళుల అర్పించారు. కార్యక్రమంలో మాడ గౌతమ్, జీడి మల్లేష్, పుప్పల రఘు, కరుణాకర్, నర్సింహారావు, సంపత్‌రావు, రవి, రాజ్‌కుమార్, ఈశ్వర్, వినోద్, స్వరూప, స్వామి పాల్గొన్నారు.

●జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీ వీధిలో గల నేతాజీ విగ్రహం వద్ద నేతాజీ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు మొలుగు దిలీప్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉడత రమేష్, నాగపూరి శ్రీనివాస్, నరేందర్, రాజు, మల్లేష్, గణేష్, మణిదీప్, షాన్వాజ్, తదితరులు పాల్గొన్నారు.

●**సైదాపూర్:** సైదాపూర్ మండల కేంద్రంలో సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్‌లో ఎస్ఐ జన్ను ఆరోగ్యం సుభాస్ చంద్రబోస్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాలుళర్పించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండ గణేష్, ఎంపీటీసీ జంపాల సంతోష్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

●**మానకొండూర్:** స్వాతంత్ర సమరయోదుడు సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాలలో యువత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

నగర సమగ్ర అభివృద్ధికి కృషి

కరీంనగర్ టౌన్, జనవరి 23: నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం నగరంలోని 14వ డివిజన్ పరిధిలోని శివాజీనగర్‌లో కార్పొరేటర్ దిండిగాల మహేశ్‌తో కలిసి నగరపాలక సంస్థ సాధారణ నిధులు 39 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పైపులైను పనులకు భూమి పూజ చేశారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, ఏఈ నిఖిత, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

టీపీవైఎస్ నగర అధ్యక్షుడిగా కనకేశ్

సుభాష్‌నగర్, జనవరి23: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ నగర అధ్యక్షుడిగా మొగిలి కనకేశ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కనకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

చదరంగ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్ 23: తమిళనాడు రాష్ట్రంలోని భారతిదాసన్ యూనివర్సిటీలో ఈనెల 25 నుంచి 29వరకు జరగనున్న దక్షిణ భారత అంతర యూనివర్సిటీ చదరంగ పోటీలకు జిల్లా కేంద్రంలోని జీనియస్ చదరంగ అకాడమి క్రీడాకారులు ఎంపిక య్యారు. ఈనెల 9న జరిగిన చదరంగ పోటీల్లో జేఎన్‌టీయూ నుంచి ఎం.అభిరాం, ఎస్.వరుణ్‌తేజ్, శాతవాహన యూని వర్సిటీ నుంచి రవిక్‌వర్ధన్, నితిన్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి దక్షిణభారత చదరంగ పోటీలకు ఎంపికయ్యారని జీనియస్ చెస్ అకాడమి కోచ్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అకాడమి డైరెక్టర్ కంకటి కనకయ్య, బాధ్యులు సృజన్, తరుణ్, వి అనూష్‌కుమార్, కోచ్ అనూప్‌కుమార్ అభినందించారు.

ముగిసిన ఏబీవీపీ యువజన క్రీడోత్సవాలు

కరీంనగర్ స్పోర్ట్స్ 23: ఏబీవీపీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన యువజనోత్సవాలు మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, జిల్లా ప్రముఖ్ గిరిబాబు, డాక్టర్ దూలం దిలీప్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి గిరిబాబు అధ్యక్షత వహించారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. శారీరక దృఢత్వం కోసం ఆటలు తోడ్పడతాయన్నారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ ఏబీవీపీ అంటేనే క్రమశిక్షణ కలిగిన సంస్థ అని అన్నారు. పోటీల విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి నందు, రాష్ట్ర లా ఫోరం కో కన్వీనర్ నక్క ప్రమోద్, రాష్ట్ర సభ్యులు జల్లపల్లి అంజన్న, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, మధు, అనూష, అరుణ్, సాయి, రంజిత్, శ్రీవర్ధన్, సుద పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్, జనవరి23: అంత ర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో విద్యార్థులను చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఓఎఫ్ వారు నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో పాఠశాల విద్యార్థులు గౌరి, సిహెచ్ ప్రగ్నసాయి, కీర్తన, వైశ్వంత్‌చక్రి, లిఖిత్ మానిక్యరావు, సుచిత్‌రెడ్డి, లిఖిత్ కుమార్, సుహాన్, గోమికలు గోల్డ్‌మెడల్స్ ఆఫ్‌ఎక్సెలెన్స్, ప్రశంసా పత్రాలు గెలుచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ

చొప్పదండి, జనవరి 23: అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించి అందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశించారు. మంగళవారం ఆయన చొప్పదండి మున్సిపల్ పాలకవర్గ సాధారణ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో మంచినీటి సరఫరాను మెరుగుపరిచేందుకు మిషన్ భగీరథ పైపులైనును నగునూరు నుంచి తీసుకువచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్మన్ విజయలక్ష్మి, కమిషనర్ శాంతికుమార్, మేనేజర్ ప్రశాంత్‌కుమార్, టిపివో ప్రదీప్ కుమార్, ఏఈ రాజేశం, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం

గంగాధర: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి దాతగా వ్యవహరిస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం ఆయన గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల క్యాలెండర్‌ను ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా నిధులు మంజూరు చేసి కాంపౌండ్ నిర్మాణం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీల, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, గీతావాణి, నిత్య, రాజమహేందర్‌రెడ్డి, రాజు, మహేశ్వర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవిని కలిసిన తుమ్మేటి

జమ్మికుంట రూరల్, జనవరి 23: ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియామకం అయిన డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియామకం అయిన అర్కార వేణుగోపాల్‌ను హైదరాబాద్‌లో మంగళవారం జమ్మికుంట మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభకు పరామర్శ

సైదాపూర్, జనవరి 23: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే భర్త బొడిగ గాలయ్య ఇటీవల మృతి చెందగా బొడిగ శోభతో పాటు వారి కుటుంబ సభ్యులను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, సైదాపూర్ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. వారి వెంట వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు ఉన్నారు.

వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు చేపట్టాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 23 : వాహనాదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణ సంస్థ అధికారులు పనులు చేపట్టాలని ఏసీపీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో వరంగల్ టూ జగిత్యాల వరకు బైపాస్ రోడ్డును నిర్మిస్తున్న డీబీఎల్ కంపెనీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు.

దాతలు ముందుకు రావాలి : చాడ

తిమ్మాపూర్, జనవరి23: మానసిక వికలాంగుల పాఠశాల కోసం దాతలు ముందుకు రావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కోరారు. మండలంలోని ఎల్‌ఎండి కాలనీలో గల స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలలో మంగళవారం చాడ వెంకటరెడ్డి తల్లిదండ్రులు కీ.శే. చాడ తిరుపతిరెడ్డి, లచ్చవ్వల జ్ఞాపకార్థం మంగళవారం మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆయన సతీమణి చాడ సుగుణతో కలిసి అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు స్వాతంత్ర్య సమరయోధులు బి.వెంకటయ్య, కొమురెల్లారెడ్డి, జనార్ధన్‌రావు, జె.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

మానకొండూర్, జనవరి 23: బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సిడిపివో సబితా సూచించారు. మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి మాట్లాడారు.

ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న ఒడితెల ప్రణవ్

వీణవంక జనవరి 23: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంటు స్థానంపై కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం కిష్టంపేట గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీతోనే పోటీ ఉంటుందని బీఆర్‌ఎస్ ఎక్కడా లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లాలి. కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గ్రామంలో బూత్ స్థాయి నుంచి నియోజికవర్గ స్థాయి కమిటీలను త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు.ప్రతి కార్యకర్త కష్టపడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు కర్ర భగవాన్‌రెడ్డి,నల్ల కొండాల్‌రెడ్డి,కొమ్మిడి రాకేష్‌రెడ్డి,రమాదేవి,మధుకర్ ఉన్నారు.

మత్స్యశాఖ సభ్యత్వ రుసుము చెల్లించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 23: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో కొత్తగా సభ్యత్వం తీసుకునేందుకు షేర్ క్యాపిటల్, అడ్మిషన్ ఫీజు రూ.1500లను ఫిబ్రవరి 15లోగా మత్స్య అభివృద్ధి అధికారి కార్యాలయంలో చెల్లించి రశీదు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. లేనిపక్షంలో ఫీజు చెల్లించిన సంఘాన్ని మినహాయించి మిగతా సంఘాలతో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కరీంనగర్ ఎన్నికల ప్రతిపాదనలు సహకార ఎన్నికల అధికారి హైదరాబాద్‌కు పంపిస్తామని తెలిపారు.

ఖాలిద్‌కు 'గిడుగు' పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఎండి ఖాలిద్

కరీంనగర్ కల్చరల్, జనవరి 23: గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత ఎండి ఖాలిద్‌కు 'గిడుగు' జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. భవానీ సహిత్య వేదిక సంస్థ ద్వారా ప్రచురించిన ఖాలిద్ రచన 'మనమంతా ఒక్కటే' పుస్తకానికి గాను అతిథులు రిటైర్డ్ హైకోర్ట్ న్యాయమూర్తి, మానవ హక్కుల కమీషన్ చైర్మన్ జస్టిస్ బి చంద్రయ్య, హైదరాబాద్ ఇంకమ్ టాక్స్ కమీషనర్ జీవన్ లాల్ లవాడియా, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కాంతి కృష్ణ, బిక్కి కృష్ణ, రచయిత వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా పురస్కారం అందించారు.

హాస్టల్స్‌కు పక్కా భవనాలు నిర్మించాలి

భగత్‌నగర్, జనవరి 23: అద్దె భవనాల్లో కొనసాగుతున్న కళాశాల వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. నగరంలోని పలు వసతి గృహాలను పరిశీలించారు. అనంతరం హాస్టల్ కమిటీలను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా రాజ్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా అయజ్, మల్లిఖార్జున్, ప్రసన్నసాయి, సాయికృష్ణ, సుమన్, షణ్ముఖలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో లోకిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి'

భగత్‌నగర్, జనవరి23: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామా రఘు వెంకటేష్, మచ్చరమేష్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని బస్టాండ్ వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో కేశబోయిన రాము, మామిడిపల్లి హేమంత్, సునావత్ శ్రీనివాస్, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, సాయి చిన్న, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సమాన విద్య అవకాశాలు కల్పించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 23: సమాజంలోని ప్రజలంతా అభివృద్ధి చెందేందుకు అందరికీ సమాన విద్య, సమాన అవకాశాలు కల్పించాలని జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. స్థానిక జడ్పీ కార్యాలయంలో ఆమె తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహించనున్న విద్యావైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రజాస్వామ్య రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్క పౌరుడికి అందాలంటే ప్రతి ఒక్కరు విద్యను వినియోగించు కోవాలని సూచించారు. ఉపాధ్యాయుల సంకల్పబలం ద్వారానే ఒక మంచి సమాజం నిర్మాణమవుతుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

● సమాచారం..

●హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని న్యూకాకతీయ పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జీ పి అలేఖ్య తెలిపారు.

● వీణవంక: మండల నూతన డిప్యూటీ తహశీల్దార్‌గా నిజాముద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన నయాబ్ తహశీల్దార్‌పై ఫోర్జరీ కేసు నమోదు కావడంతో కలెక్టర్ ఆఫీసుకు సరెండర్ చేశారు.

- వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో 5 టాక్టర్ల ఇసుకను 25న బహిరంగ వేలం వేస్తున్నట్లు తహశీల్దార్ తిరుమల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

● చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు చెందిన ట్రైనీ ఇంజనీర్లు సందర్శించారు. విద్యాబోధన, పాఠ్యాంశాలు, సౌకర్యాలను తెలుసుకున్నారు.

● తిమ్మాపూర్: అలుగునూర్‌లో గల సీవోఈ(గురుకుల) పాఠశాలకు అందులో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో 75వేల రూపాయలు జమచేసి నూతన జిరాక్స్ మిషన్‌ను కొనుగోలు చేసి పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్‌కు అందజేశారు.

● తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొలిపాక కనకయ్య కుటుంబానికి గ్రామ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

● ఇల్లందకుంట: ఎమ్మెల్సీగా ఎంపికైన బల్మూరి వెంకట నర్సింగారావును హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో ఇల్లందకుంట కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

- జమ్మికుంట రూరల్: డాక్టర్ బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. వేర్వేరుగా కలిసిన వారిలో కసుబోజుల వెంకన్న, మొలుగూరి సదయ్య, సలీం పాషా, పొల్లాల శ్రీనివాస్ ఉన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం పాపయ్యపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం వార్డు సభ్యులతో కలిసి సర్పంచ్ వజ్జపల్లి ఆగయ్య ప్రారంభించారు.

● సైదాపూర్: సైదాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థి మణికంఠ జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పిజికల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. మణికంఠను ప్రిన్సిపాల్ పర్హానా, వైస్ ప్రిన్సిపాల్ మోయిస్‌లు అభినందించారు.

● గంగాధర: రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన దుఖాణం నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని ఏవో రాజు అన్నారు. మంగళవారం కురిక్యాల,మధురానగర్, బూరుగుపల్లిలో ఎరువుల దుఖానాలను తనిఖీ చేశారు.

● తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగు నూర్‌లో గల కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆరు అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

- తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ మాదాడి భారతి అధ్యక్షతన అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు.